

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

అనంతపురం టౌన్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం కలెక్టరేట్‌లో యథాతథంగా కొనసాగుతుందని కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

దళారుల చేతిలో మోసపోవద్దు

ప్రభుత్వ విప్ కాలవ..

కణేకల్లులో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ కాలవ

కణేకల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్నో వ్యయ, ప్రయాసలకోర్చి పండించిన ధాన్యాన్ని దళారుల చేతిలో పెట్టి మోసపోవద్దని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ భారతి సొసైటీ వద్ద వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక నుంచి వందలాది మంది దళారులు కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో తిరుగుతూ రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి, ఆ తర్వాత ఐపీ పెట్టే అవకాశం ఉన్నందున రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయిస్తే 48 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ అవుతుందని ఆయన పేర్కొన్నారు. రైతులు పండించిన ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ. 2320లు, సాధారణ రకానికి రూ. 2300లు ప్రభుత్వం ధరను నిర్ణయించిందన్నారు. అలాగే గోనెసంచులతో పాటు రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్చెల్సీ ఆయకట్టు రైతుల కోసం తాను ప్రత్యేకంగా ప్రభుత్వంతో చర్చించి కణేకల్లులోనూ, బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్టలోనూ వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఐదువేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు విప్‌ను సన్మానించి, వరికొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డీఎం రమేష్‌రెడ్డి, ఆర్డీఓ వసంత బాబు, తహసీల్దార్ ఫణికుమార్, ఏఓ శ్రావణ్‌కుమార్, స్టాకిస్ట్ సుధాకర్, సొసైటీ అధికారులు సతీష్‌తో పాటు టీడీపీ కన్వీనర్ లాలెప్ప, మాబుసాబ్, చంద్రశేఖర్‌గుప్తా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీ

అనంతపురం విద్య, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) ఆదివారం జిల్లాలో సజావుగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు 3665 మంది విద్యార్థులకుగాను 3503 మంది హాజరయ్యారు. కేంద్రాలను పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవింద్‌నాయక్ తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న పరీక్షల ప్రాథమిక కీ విడుదల అవుతుందన్నారు. ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో అందుబాటులో ఉంచుతారన్నారు. ప్రాథమిక కీపై ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 16 సాయంత్రం 5 గంటల్లోపు విద్యార్థులు తమ స్కూల్ లాగిన్ నుంచి గ్రీవెన్స్ లింక్ ద్వారా తెలియజేయాలని సూచించారు.

పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోండి

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

శాస్త్రవేత్తలతో కలిసి పలు రకాల పంటల పరిశీలన



కందిపంటను పరిశీలిస్తున్న పరిటాల సునీత

రామగిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉద్యాన, కందిపంటల సాగు విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు ఇతర శాస్త్రవేత్తలతో కలిసి ఆదివారం సాయంత్రం ఆమె మండలంలోని వెంకటాపురం, కనగానపల్లి మండలం లో నరసింపల్లి గ్రామాలలో చీనీ, సీతాఫలం, కంది, సపోట, కొబ్బరి, అల్లనేరేడు, ఉసిరి, చింత పంటలను పరిశీలించారు. కందిపంటకు మచ్చలపురుగు ఆశించి దాదాపు 60శాతం వరకు దెబ్బతిన్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. జిల్లాలోని రైతులందరికి ఈ పంటలపై తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆమె అధికారులను కోరారు. కృషి విజ్ఞాన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు మాట్లాడుతూ కందిపంటకు మచ్చతెగుళ్లు సోకిందని, తాము సూచించిన విధంగా మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. చీనీలో కూడా ఇనుపధాతు లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కొబ్బరిలో నల్లి పురుగు ఆశించిందని, అందుకు కూడా మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులు పంటలు నష్టపోకుండా ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు తీసుకోవాలని పరిటాల సునీత సూచించారు, డ్రోన్ ద్వారా మందులు పిచికారి చేయడాన్ని ప్రత్యక్షంగా ఆమె పరిశీలించారు.

కలెక్టర్ సార్..!

“ జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు ఖాళీ అయినట్లుగా కనబడుతోంది. ఇటీవల ప్రాజెక్టు ఉన్నతాధికారి(ఏపీసీ) బదిలీ కావడం, కీలకమైన ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రాజెక్టు పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఏపీసీ లేకపోవడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రాజెక్టులో పని చేసే వందలాది మంది ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కీలక పోస్టులైన సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. ప్రాజెక్టుకు చైర్మన్‌గా వ్యవహరించే జిల్లా కలెక్టర్ సైతం ఇన్‌చార్జ్‌ను నియమించకపోవడం, సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టు భర్తీ గురించి ఆలోచించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

-ఆంధ్రజ్యోతి, అనంతపురం విద్య

జీతాలు ఇప్పించండి

వేతనాల కోసం సమగ్రశిక్ష ఉద్యోగుల ఎదురుచూపు

- రూ. 3.19 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- ఏసీపీ లేకపోవడంతోనే సమస్య
- ప్రాజెక్టులో కీలక పోస్టులు ఖాళీ
- పట్టించుకోని చైర్మన్



సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయం

ప్రాజెక్టు పరిధిలో పనిచేసే ఉద్యోగులు	
కేజీబీవీ టీచింగ్ ఉద్యోగులు	488
కేజీబీవీ నాన్ టీచింగ్	342
పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు	208
ఎమ్మార్సీ అండ్ ఇతర స్టాఫ్	207
సీఆర్పీలు	133
మోడల్ స్కూల్ స్టాఫ్	45
డీపీఓ స్టాఫ్	09

కీలక సీట్లు కూడా ఖాళీనే

సమగ్రశిక్ష ప్రాజెక్టులోని కీలక సీట్లు కూడా ఖాళీగానే ఉన్నాయి. ప్రాజెక్టులోని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ), గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(జీసీడీఓ), అసిస్టెంట్ ఏఎంఓ (జనరల్), అసిస్టెంట్ ఏఎంఓ (కన్నడ), అసిస్టెంట్ అలెస్కో, అసిస్టెంట్ సీఎంఓ, అసిస్టెంట్ ఐఈడీ, అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానించారు. దరకాస్తులను పరిశీలించి, ఇంటర్వ్యూలు కూడా పూర్తి చేశారు. కానీ ఇంత వరకూ అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వలేదు. ప్రాజెక్టు ఉన్నతాధికారైన ఏపీసీ, 8 కీలక పోస్టుల్లో అధికారులు లేకపోవడంతో ప్రాజెక్టు మొత్తం ఖాళీగా మారింది. ఉద్యోగుల జీతాలు చెల్లింపుపై వివరణ కోసం డీఈఓ ప్రసాద్‌బాబుకు ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

రూ. 3.19 కోట్ల నిధులు విడుదల

జిల్లా సమగ్రశిక్ష ప్రాజెకు కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులతోపాటు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, ఎంఈఓ కార్యాలయాలు, భవిత కేంద్రాల్లో భారీగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,432 మంది ఉద్యోగులున్నారు. వారికి నవంబరు నెల జీతం చెల్లించాల్సి ఉంది. సుమారు వారం రోజుల కిందట రూ. 3,19, 25,000 నిధులు వచ్చాయి. ప్రాజెక్టుకు పెద్ద దిక్కైన అడిషనల్ ప్రాజక్టు కో-ఆర్డినేటర్ (ఏపీసీ) ఇటీవలే బదిలీ అయ్యారు. ఫలితంగా జీతాలు పెట్టేవారు లేక ఎవరికీ ఇంత వరకు వేతనాలు ఇవ్వలేదు. జిల్లా ప్రాజెక్టులో పనిచేస్తున్న ఏపీసీ బదిలీ అయితే.. ఆ స్థాయి అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తారు. అయితే 10 రోజులు కావస్తున్నా ఎవరినీ ఇన్‌చార్జ్‌గా నియమించలేదు. దీంతో ఉద్యోగులకు అవస్థలు తప్పడం లేదు.

జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి



వందలాది మంది ఉద్యోగులు పనిచేసే ప్రాజెక్టుకు ఇప్పటి వరకూ ఇన్‌చార్జ్ నియమించలేదు. వారం కిందటకే రూ. 3.19 కోట్ల నిధులు వచ్చాయి. కానీ బిల్లులు చేయాల్సిన ఏపీసీ పోస్టు ఖాళీగా ఉంది. వెంటనే ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి జీతాలు పడేలా చూడాలి. త్వరలో క్రిస్మస్, వచ్చే నెలలో సంక్రాంతి పండుగలున్నాయి. పండుగల వేల జీతాలు చెల్లించకుండా ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సరికాదు.

- విజయ్, జిల్లా చైర్మన్, ఏపీ సమగ్రశిక్ష అండ్ కేజీబీవీ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫోరం, జేఏసీ

భయం.. భయం!

- కుక్క కాటుతో ఆస్పత్రులకు బాధితుల క్యూ..
- జిల్లా ఆస్పత్రికి నెలకు సరాసరి 500 కేసులు

అనంతపురంటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజలను కుక్కలు భయపెడుతున్నాయి. ఇటీవలి కాలంలో వీధి కుక్కలు విపరీతంగా పెరిగిపోయి, మనుషుల మీద దాడి చేస్తున్నాయి. కుక్క(అన్ని కుక్కలు కాదు)కాటుకు సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే రేబిస్ వ్యాధి సోకి మనుషులు మరణించే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నాలుగు రోజుల కిందట శింగనమల మండలం తరిమెల గ్రామం నుంచి కుక్కకాటు బాధితుడిని జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఎమర్జెన్సీ (క్యాజువాలిటీ)లోకి తీసుకురాగా అప్పటికే ఆవ్యక్తి పరిస్థితి తేడాగా కనిపించింది. రేబిస్ లక్షణాలు కనిపిస్తున్నాయని డాక్టర్లు చెప్పడంతో కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. సాధారణంగా రేబిస్ నిర్ధారణ అయిన వ్యక్తులు కోలుకునే అవకాశం చాలా తక్కువ అని, ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. అలాంటి రేబిస్ కేసు జిల్లాలో వెలుగులోకి రావడంతో వైద్య వర్గాలు, జనం ఆందోళన చెందుతున్నారు.



ఆస్పత్రిలోని వార్డు వద్ద చికిత్సకు వచ్చిన కుక్కకాటు బాధితులు

ఆస్పత్రికి బాధితుల క్యూ



జిల్లా సర్వజన ఆస్పత్రికి కుక్కకాటు బాధితులు క్యూ కడుతున్నారు. ఆస్పత్రి రికార్డుల ప్రకారం గత 11నెలల్లో 6092మంది కుక్క కాటుకు చికిత్స కోసం వచ్చారు. ఈలెక్కన ప్రతినెలా 500మంది కుక్క కాటు బాధితులు ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందుతున్నారు. ఇటీవల కాలంలో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. అవి వీధుల్లో వెళ్లే ప్రజలను వెంటపడి కొరుకుతున్నాయి. జిల్లా ఆస్పత్రికి వచ్చే బాధితుల్లో సగం మంది అనంతనగరవాసులే ఉంటున్నారు. దీన్ని బట్టి నగరంలో కుక్కలు ఏస్థాయిలో మనుషుల మీద దాడి చేస్తున్నాయో ఊహించుకోవచ్చు. జిల్లాలో 11సీహెచ్‌సీలు, 47పీహెచ్‌సీలు ఉన్నాయి. అక్కడికి ఆయాప్రాంతాలకు చెందిన కుక్కకాటుకు గురైన బాధితులు వెళ్లి చికిత్స పొందుతున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు 100 మందివరకు కుక్కకాటు బాధితులు వస్తుంటారని వైద్య శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈలెక్కన నెలకు దాదాపు మూడు వేలమంది వరకు కుక్కకాటుకు గురవుతున్నట్లు తెలుస్తోంది.



కుక్కకాటు బాధితుడికి సూది మందు వేస్తున్న నర్సు

ఈ ఏడాది బాధితుల వివరాలు	
నెల	కేసులు
జనవరి	600
ఫిబ్రవరి	596
మార్చి	603
ఏప్రిల్	678
మే	615
జూన్	512
జూలై	442
ఆగస్టు	480
సెప్టెంబరు	368
అక్టోబరు	582
నవంబరు	636

● నిర్లక్ష్యం ఉండకూడదు



కుక్కకాటు విషయంలో ఎంత మాత్రం నిర్లక్ష్యం పనికిరాదు. అయితే అన్నికుక్క కాట్లకు భయపడాల్సిన పని లేదు. కొందరు పెంపుడు కుక్క కరిచినా చికిత్సకు వస్తున్నారు. అయితే పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించి ఉంటే కరిచినా, గిల్లినా ఏమీకాదు. వ్యాక్సిన్ వేయించని కుక్కలు కరిస్తే తప్పనిసరిగా డాక్టర్లను కలిసి చికిత్స తీసుకోవాలి. పిచ్చికుక్క కరిస్తే బాగా ప్రమాదం. ఈకుక్క కరిచినవాళ్లు వెంటనే ఆస్పత్రికి వచ్చి తగిన చికిత్స తీసుకోవాలి. లేకపోతే రేబిస్ వ్యాధిన పడి ప్రాణాలు పోగొట్టుకోవాల్సి వస్తుంది. శింగనమల కేసు విషయంలో కూడా నిర్లక్ష్యం చేశారనిపిస్తోంది. రేబిస్ లక్షణాలు కనిపిస్తుండటంతో కర్నూలు ఆస్పత్రికి తీసికెళ్లారు. అక్కడ రెండురకాల పరీక్షలు చేస్తే వ్యాధి నిర్ధారణ అవుతుంది.

- డాక్టరు భీమసేనాచారి(జనరల్‌మెడిషన్ విభాగాధిపతి)

● తరిమెల వ్యక్తికి రేబిస్ లక్షణాలతో కలకలం

కుక్కకాటుకు గురైన వ్యక్తి సాధ్యమైనంత తొందరగా చికిత్స పొందితే ఎలాంటి ప్రమాదం ఉండదు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధి సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. తాజాగా తరిమెల గ్రామానికి చెందిన ఓవ్యక్తిలో రేబిస్ లక్షణాలు బయటపడటం అందరినీ కలవరపెడుతోంది. కుక్కకాటుకు వైద్యం తీసుకోవడంలో నిర్లక్ష్యం చేయడం వల్లే ఇప్పుడు అతడిలో రేబిస్ లక్షణాలు కనిపిస్తున్నాయని ఆయనను పరీక్షించిన డాక్టరు అంటున్నారు.

● అవసరమైన వ్యాక్సిన్ అందుబాటులో ఉంది



కుక్కకాటు కేసులు ఇటీవల కాలంలో అధికంగా వస్తున్నాయి. కుక్కకాటుకు గురైన బాధితులకు అవసరమైన చికిత్సలు ఆస్పత్రిలో అందిస్తున్నాం. వ్యాక్సిన్ కూడా అవసరమైన మేర అందుబాటులో ఉంది. రేబిస్ కేసులు గత ఐదారేళ్లుగా నమోదుకాలేదు. ఇపుడు కుక్క కాటుతో ఆస్పత్రిఇకి వచ్చిన శింగనమల నియోజకవర్గానికి చెందిన వ్యక్తిలో ఆలక్షణాలు ఉన్నాయని డాక్టర్లు అంటున్నారు. దీంతో మెరుగైన చికిత్సకోసం కుటుంబసభ్యులు కర్నూలుకు తీసికెళ్లారని తెలిసింది. రేబిస్ ప్రాణాంతక వ్యాధి. అందుకే జాగ్రత్తగా ఉండాలి.

- డాక్టరు వెంకటేశ్వరరావు(ఆస్పత్రి సూపరింటెండెంట్)

తాగునీటి సమస్యకు చెక్..!



ఉదిరిపికొండ నుంచి ఉరవకొండకు పైపులైన్ పనుల కోసం రూ.16కోట్లు మంజూరు

ఎన్నికల హామీ నెరవేర్చే దిశగా మంత్రి కేశవ్ అడుగులు



రహదారి పక్కన ఉంచిన పైపులు

ఉరవకొండ, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాల నుంచి విముక్తి కలగనుంది. ఉరవకొండకు నింబగల్లు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుతో పాటు, పీఏబీఆర్ డ్యాం నుంచి రోజుకు 20లక్షల లీటర్ల నీరు సరఫరా అవుతున్నాయి. పట్టణంలో 90వేలకు పైగా నివాస గృహాలు ఉండగా 45వేల వరకూ జనాభా ఉంది. ప్రస్తుతం ఉన్న జనాభాకు ఆ నీరు సరిపోవడం లేదు. రోజు మార్చి రోజు నీరు అందించడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్య తొలగించడానికి కూడేరు మండలం ఉదిరిపికొండ నుంచి ఉరవకొండ వరకూ రూ.16.3కోట్లతో జేజేఎం కింద, 17.8 కి.మీలు పైపులైన్ నిర్మాణం పనులు చేయడానికి సమాయత్తమవుతున్నారు. పైప్‌లైన్ నిర్మాణం పనుల కోసం అవసరమైన పైపులను కాంట్రాక్టర్లు తెప్పించి జాతీయ రహదారి వెంట దించుతున్నారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు తాగునీటి సమస్య తీర్చేందుకు రూ.16కోట్లతో ప్రత్యేక పైపులైన్ నిర్మాణానికి ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ చూపారు. రెండు నెలల కిందట ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి, ఆ దిశగా అధికారులను సమాయత్తం చేశారు.



పైపులైన్ నిర్మాణ పనులపై అధికారులకు వివరిస్తున్న మంత్రి (ఫైల్)

టీడీపీ హయాంలోనే పైపులైన్ మంజూరు

పీఏబీఆర్ డ్యాం నుంచి ఉదిరిపికొండకు వచ్చే నీటిని ఉరవకొండకు తరలించడానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రత్యేక పైపులైన్ మంజూరు చేశారు. నిర్మాణం పనులు ప్రారంభమయ్యేలోపే ఎన్నికలు వచ్చాయి. 2019లో టీడీపీ అధికారం కోల్పోవడంతో పనులు ఆగిపోయాయి. వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని ఐదేళ్లు ప్రచారం కోసం వాడుకున్నదే తప్పా పనులు చేపట్టలేదు. సిమెంట్ పైపులు కూడా వృథాగా పడి ఉండేవి. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో పది రోజులకు ఒక్కసారి తాగునీటిని వదిలారు. ఎన్నికల సమయంలో పయ్యావుల కేశవ్ తాగునీటి సమస్యనే అస్త్రంగా చేసుకుని ప్రచారం నిర్వహించి సక్సెస్ అయ్యారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తాగునీటి సమస్య తీర్చేందుకు పనులు చేపట్టనున్నారు. అందులో భాగంగా త్వరలోనే రూ.16కోట్లతో పైపు లైన్ నిర్మాణం పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇంద్రావతి వద్ద హంద్రీనీవా కాలువ నుంచి నింబగల్లు సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌లోకి నీటిని నింపేందుకు కాలువ వద్ద ఇన్‌టెక్‌వెల్ నిర్మించి అక్కడ నుంచి మోటార్ల ద్వారా పైప్‌లైన్‌తో నింబగల్లు చెరువులోకి నీటిని తరలించనున్నారు. అందుకోసం 6.2 కి.మీలు పైపులైన్‌కు రూ.4కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే నింబగల్లు నుంచి ఉరవకొండ వరకూ పాత పైప్‌లైన్‌కు ప్రత్యామ్నాయంగా మరో పైపులైన్ ఏర్పాటుకు ప్రతి పాదనలు తయారు చేశారు.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం: షఫ్రీన్, డీఈ

త్వరలోనే ఉదిరిపికొండ-ఉరవకొండ పైపులైన్ నిర్మాణం పనులు ప్రారంభిస్తాం. సర్వే కూడా పూర్తి చేశాం. రూ.16కోట్లతో 17కి.మీలు పైపులైన్ పనులు చేపట్టనున్నాం.

లైనింగ్ పనులతో కాంట్రాక్టర్లకే లాభం

డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు

ఉరవకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనుల వల్ల రైతుల కంటే కాంట్రాక్టర్లకే లబ్ధి చేకూరుతుందని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హంద్రీనీవా కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు చేయడం వల్ల జిల్లాకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేసి జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో నీరు పారేలా కాలువను వెడల్పు చేస్తామని, ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోవాలని కోరారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు, హెచ్ఎన్ఎస్ఎస్ డిస్ట్రిబ్యూటరీ పనులు చేపట్టాలని ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు శీన, వలి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 20తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చా యన్నారు. కిలో సరాసరి ధర రూ. 13, కనిష్ఠ ధర రూ. 8 పలికినట్లు ఆయన తెలిపారు.

కంది విక్రయానికి రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి

అనంతపురం అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కంది విక్రయించేందుకు రైతు సేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైతులకు ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి ఆదివారం ప్రకటనలో సూచించారు. జిల్లాలో కంది పంట కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో కంది ఈ పంట నమోదు చేసుకున్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో సోమవారం నుంచి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. జనవరి 15 నుంచి కంది ఉత్పత్తులను కొనుగోలు చేస్తామన్నారు. మార్కెట్ ధరకే కంది పంటను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

15న మాజీ సైనికులకు సన్మానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన 1962-65 యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు ఈ నెల 15వ తేదీన సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని ఆ సంఘం కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెప్టెన్ షేకన్న మాట్లాడుతూ... 1971 విజయ్ దివస్ 53వ సంవత్సరం యుద్ధ ముగింపు సందర్భంగా సన్మానం చేస్తున్నామన్నారు. స్థానిక వీకే భవన్‌లో కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలోని మాజీ సైనికులు, సంఘం సభ్యులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఐటీఐలో అప్రెంటీస్‌షిప్ మేళా

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ విద్యార్థులకు సోమవారం పీఎం నేషనల్ అప్రెంటీస్‌షిప్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. కళాశాలలో నిర్వహించే ఈ మేళాకు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై విద్యార్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఐటీఐలో ఉత్తీర్ణులై ఎన్‌టీసీ పొందిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు వారి ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకురావాలని కోరారు.

ఆర్టీసీలో నేడు సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామమూర్తి పేర్కొన్నారు. టెన్త్, ఐటీఐ మార్కుల జాబితా, ఎన్‌టీసీ, ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, కుల ధ్రువీకరణ, స్పోర్ట్స్, ఎన్‌సీసీ సర్టిఫికెట్లను పరిశీలిస్తారని తెలిపారు. జెడ్‌ఎస్‌టీసీ కర్నూలు ట్రైనింగ్ కళాశాలకు ఆన్‌లైన్ ప్రొఫైల్, ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్, పాస్ ఫొటోలు తీసుకెళ్లాలని సూచించారు. 9న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు డీజిల్ మెకానిక్ ట్రేడ్, 12న మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్, సివిల్ ట్రేడ్ల విద్యార్థులకు వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుందని తెలిపారు. వివరాలకు 08518257025 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ బీఈడీ కళాశాలలో సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సోమశేఖర్ తెలిపారు. బీఎడ్-2024 ఎంట్రెన్స్‌లో అర్హత సాధించి ఏ కళాశాలలో ప్రవేశం పొందని వారు అర్హులన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన వెంటనే కోర్సు ఫీజు చెల్లించాలన్నారు. ఆసక్తిగల వారు సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

సాహో శ్రీమంతుడా..!

జన్మభూమి రుణం తీర్చుకుంటున్న మస్తాన్‌వలి... సొంత నిధులతో కొర్తికోటలో అభివృద్ధి పనులు


మసీదు నిర్మాణానికి సాయం చేస్తున్న మస్తాన్‌వలి

పేదరికంతో పడరాని పాట్లు పడుతూ, పొట్టకూటి కోసం మహానగరానికి వెళ్లిన ఓ వ్యక్తి సినిమాల్లో చూపించిన విధంగా కొన్నేళ్ల తర్వాత శ్రీమంతుడిగా తిరిగొచ్చి ఆ గ్రామ ప్రజల కష్టాలు, కన్నీళ్లు తుడుస్తున్నాడు. కష్ట కాలంలో అండగా నిలుస్తున్నాడు. ఆలయాలు, మసీదుల నిర్మాణాలు, మరమ్మతులకు చేతనైన సాయం చేస్తున్నాడు. విద్య, వైద్యం విషయంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ ముందుకొచ్చి ఆదుకుంటున్నాడు. ఆయనే తనకల్లు మండలం కొర్తికోటకు చెందిన ఎస్‌కే మస్తాన్‌వలి. పేదరికంతో కష్టాలు పడుతూ జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ బిల్డర్‌గా స్థిరపడ్డాడు. ఇప్పుడు గ్రామ అభివృద్ధి కోసం తనవంతుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఊరికి ఉపకారిగా నిలిచాడు.


మస్తాన్‌వలి

తనకల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పేదరికంలో పుట్టి శ్రీమంతుడిగా ఎదిగిన ఓ వ్యక్తి తాను పుట్టి పెరిగిన ఊరి రుణం తీర్చుకుంటున్నాడు. మండలం కొర్తికోట గ్రామానికి చెందిన మస్తాన్‌వలి పేదరికంతో ఇబ్బంది పడుతూ ఉపాధి కోసం కొన్నేళ్ల కిందట హైదరాబాద్‌కి వలస వెళ్లారు. అక్కడ తన శ్రమ, పట్టుదల కష్టాలు అధిగమించి బిల్డర్‌గా ఎదిగి అక్కడే స్థిరపడ్డారు. ఏళ్లు గడిచినా కన్న ఊరిని మాత్రం మరిచిపోకుండా తనవంతుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా సాయం అందిస్తున్నారు. ఇప్పటికే రూ. మూడు కోట్లకు పైగా ఆయన వివిధ సేవా కార్యక్రమాలకు ఖర్చు చేశారు. తాను ముస్లిం కులంలో జన్మించినా.. రామాలయాలు, అమ్మవారి ఆలయాలు, ఇతర ఆలయాల నిర్మాణానికి రూ.లక్షల్లో విరాళాలు అందించారు. కొర్తికోట, కొండవెనుకపల్లి, తమ్మలవారిపల్లి, దుగినేపల్లి, గాండ్లపెంట, తదితర ప్రాంతాల్లో ఎన్నో ఆలయాలకు ఆయన విరాళాలు ఇచ్చారు. కొర్తికోటలో మదరసా, మసీదు నిర్మాణం చేపట్టారు. నల్లగుట్లపల్లి, కదిరి, గాండ్లపెంట, దుగినేపల్లి గ్రామాల్లో మసీదుల నిర్మాణానికి సాయం అందించారు. వందకుపైగా జంటలకు ఉచిత వివాహాలు చేయించారు. పేదల పిల్లల వివాహాలకు ఆర్థిక సాయం అందిస్తున్నారు.

రాజకీయ ప్రస్థానంలోనూ సేవే

గత టీడీపీ పాలనలో మస్తాన్ వలి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆ సమయంలో కొర్తికోట పంచాయతీలో ప్రభుత్వం మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టింది. లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోవని మస్తాన్ తనవంతుగా ప్రతి మరుగుదొడ్డికి రూ.1500 చొప్పున 600కు పైగా మరుగుదొడ్ల నిర్మాణానికి సాయం చేశారు. తాను సర్పంచ్‌గా ఉన్న ఐదేళ్ల కాలంలో పంచాయతీలోని కొర్తికోట, కొండవెనుకపల్లి గ్రామాల్లో చౌకధాన్యపు డిపోల ద్వారా సరుకులన్నింటిని లబ్ధిదారులకు ఉచితంగా అందించారు. అందుకు అయ్యే ఖర్చును తానే భరించారు. గర్భవతుల కోసం ఉమ్మడిగా సీమంతం కార్యక్రమాలు నిర్వహించి ఆడపడచులకు అన్నగా నిలిచారు. కరోనా కష్టకాలంలో తన పంచాయతీ పరిధిలోని పేదలకు నిత్యావసరాలు అందించి ఆదుకున్నారు. మస్తాన్‌వలి చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించిన ప్రభుత్వం ఆగస్టు 15న ఉత్తమ సర్పంచ్‌గా ఎంపిక చేసింది. కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఇలా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ఎందరికో ఆదర్శంగా నిలిచారు.


అప్పటి కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటూ..

సేవ చేయడంలోనే ఆనందం

నేను చేస్తున్న పనికన్నా, సేవ చేయడంలోనే ఆనందం ఉంది. నేను ఒకప్పుడు అనేక బాధలు, ఇబ్బందులు చవిచూశా. నాలాగ ఇతరులు ఇబ్బందులు పడకూడదనే చేతనైన సాయం చేస్తున్నా. నా దగ్గరకు వచ్చి సాయం కోరిన వారిని ఉత్తచేతులతో వెనక్కు పంపిన సందర్భాలు లేవు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయడానికి ప్రయత్నిస్తా. జన్మభూమి రుణం తీర్చుకోవడానికి నావంతు కృషిని కొనసాగిస్తా.

- ఎస్‌కే మస్తాన్‌వలి

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి


ఎంపీ అంబికా వినతి

అనంతపురం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయ సామాజికవర్గాన్ని షెడ్యూల్డ్ తెగల(ఎస్టీ) జాబితాలో చేర్చాలని ఆర్‌జీఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ బిశ్వజిత్, అడిషనల్ ఆర్‌జీఐ సునీల్‌కుమార్‌ను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు ఆదివారం ఢిల్లీలోని ఆర్‌జీఐ కార్యాలయంలో ఆ ఇరువురి అధికారులను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కలిసి వినతి పత్రం అందజేశారు. ఏపీలో వాల్మీకిబోయ సామాజికవర్గానికి సంబంధించి చాలాకాలంగా నలుగుతున్న సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. కూటమి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా ప్రయత్నాలు చేసినప్పటికీ షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్చడంలో జాప్యం అవుతోందన్నారు. ఫలితంగా ఈ సంఘం గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. రాష్ట్రంలోని విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లోని షెడ్యూల్డ్ ప్రాంతాల్లో మాత్రమే వాల్మీకి సామాజికవర్గం షెడ్యూల్డ్ తెగలుగా గుర్తింపు పొందిందని వివరించారు. వాల్మీకి బోయ సామాజికవర్గం విస్తృత సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనాన్ని గుర్తించి, రాష్ట్ర ప్రభుత్వం వారిని ఎస్టీ జాబితాలోకి చేర్చాలని సిఫార్సు చేస్తూ 2017 డిసెంబరు 2న అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒక తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టగా.. ఆమోదం లభించిందన్నారు. ఈ తీర్మానం రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ నివేదిక ఫలితాల ఆధారంగా రూపొందించారన్నారు. ఈ విషయం సత్యపాల్ కమిటీ నిర్వహించిన ఎథ్నోగ్రాఫిక్ అధ్యయనంలో తేలిందన్నారు. ఈ అధ్యయనాలు వాల్మీకి బోయ వర్గాల వెనుకబాటుతనాన్ని స్పష్టంగా నిర్ధారించాయన్నారు. లోకూర్ కమిటీ గుర్తించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయన్నారు. ఆ సమగ్ర సమాచారాన్ని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ)కి ఈ ప్రతిపాదన సూచించారన్నారు. ఆర్‌జీఐ 2018 మే 10న ప్రతిస్పందనలో ప్రతిపాదనపై మరింత వివరణ కోరిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2018 సెప్టెంబరు 5న ఆర్‌జీఐ కోరిన అదనపు వివరాలను వెంటనే అందించిందన్నారు. సంఘం యొక్క కేసును మరింత ఎథ్నోగ్రాఫిక్ సాక్ష్యం, సమర్థనతో బలపరచిందనీ, ఈ ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. వాల్మీకి బోయ సమాజాన్ని అనిశ్చితిలో ఉంచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి చురుకైన మద్దతు, సదుపాయంతో ఆర్‌జీఐకి వాల్మీకి బోయ సమాజంపై సమగ్ర అధ్యయనాన్ని చేపట్టాలని ప్రతిపాదిస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌జీఐకి అవసరమైన అన్ని రకాల సహాయాలను అందించడానికి, అట్టడుగు వర్గాలకు సరైన గుర్తింపు, ఉద్ధరణను నిర్ధారించడానికి కట్టుబడి ఉందన్నారు. త్వరితగతిన కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయానికి చర్యలు తీసుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆర్‌జీఐ అధికారులను కోరారు.


ఆర్‌జీఐ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

రిమాండ్‌కు అక్రమార్కుడు

అనంతపురంరూరల్,డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు పంపించారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామ సర్వే నెంబరు 194-8లో పట్టాలు ఇప్పిస్తానని కురుగుంట గ్రామానికి చెందిన నాగభూషణం పేదలతో పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశాడు. ఈక్రమంలోనే గతంలో పనిచేసిన తహసీల్దార్ పేరితో పట్టాలు సృష్టించి వారి చేతిలో పెట్టారు. పట్టాలు పొందిన వారు రెవెన్యూ కార్యాలయంలో ఆరా తీయగా అవి నకిలీవని తెలియడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో రెవెన్యూ అధికారులు నాగభూషణంపై పోలీ సులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై నకిలీ పట్టాల పేరిట గుండు.. పట్టా..ఫట్.. శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. ఈనేపథ్యంలో నకిలీ పట్టాలపై జిల్లా ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి పోలీసులతో విచారణ చేయించారు. రెండురోజుల కిందట కురగుంటలోని నాగభూషణం ఇంట్లో రెవెన్యూ అధికారులు, పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నకిలీ పట్టాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది. కాగా చాలా మంది నాయకులు ఇదే విధంగా తమ వ్యవహారాలను సాగిస్తున్నారు. ఈ క్రమంలో నకిలీ పట్టాలు సృష్టించి పేదలను నిలువు దోపిడీ చేస్తున్నారు. అలాంటి వారికి సంబంధించిన వివరాలు రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లినట్లు సమచారం. ఈక్రమంలోనే వారిపై పోలీసు కేసులు పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు ఆయా వర్గాల్లో చర్చసాగుతోంది.


పట్టా.. ఫట్!

నకిలీ పట్టాల వ్యవహారంపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనం

సందిగ్ధం..!

ఆస్పత్రి ఏఓ జాయినింగ్‌పై అయోమయం

డిప్యూటీ కలెక్టరును నియమించిన సర్కారు

వైద్యవర్గాలలో రెవెన్యూ పెత్తనంపై వ్యతిరేకత

తక్కువ కేడర్ పోస్టు ఇవ్వడంపై రెవెన్యూలోనూ గుర్రు

అనంతపురం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా తీసుకున్న నిర్ణయంతో జిల్లా సర్వజనాస్పత్రి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్(ఏఓ) జాయినింగ్‌పై అయోమయం కొనసాగుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రెవెన్యూ డిపార్టుమెంటుకు చెందిన డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునరెడ్డిని జిల్లా ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా నియమించారు. పదిరోజుల కిందట అధికారికంగా ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన ఇప్పటి వరకు జాయిన్‌కాలేదు. గత బుధవారం జాయిన్ అవుతానని ఫోన్‌లో చెప్పారని ఆస్పత్రి అధికారులు పేర్కొన్నారు. ఏమిజరిగిందో ఏమో కానీ ఆయన ఈ ఆస్పత్రి వైపు చూడలేదు. మళ్లీ ఏమనే సమాచారం కూడా తెలుపలేదు. దీనిపై ఆస్పత్రి, రెవెన్యూ వర్గాల నుంచి అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రెవెన్యూ డిపార్టుమెంట్‌వారిని ఆస్పత్రికి నియమించడం పట్ల వైద్యవర్గాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇక్కడ పనిచేసే డాక్టర్లందరూ గ్రేడ్-1వారే ఉంటారనీ, అలాంటి తమపై అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా గ్రేడ్-1 హోదాలో ఉన్న రెవెన్యూ ఆఫీసర్‌ను వేయడం ఏంటని వైద్యవర్గాలు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. కాగా డిప్యూటీ కలెక్టర్లను జిల్లా ఆస్పత్రికి నియమించి, వారి అధికారాలను ఒక్క ఆస్పత్రికే పరిమితం చేయడం, అలాగే ఆస్పత్రి సూపరింటెండెంట్ కిందిస్థాయి పోస్టుకు నియమించడం పట్ల రెవెన్యూ వర్గాలు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈనేపథ్యంలోనే ఆస్పత్రి ఏఓగా నియమితుడైన మల్లికార్జునరెడ్డి జాయిన్ కాలేదా అనే చర్చసాగుతోంది. మరోవైపు ఏదైనా రాజకీయకోణంలో ఆయన జాయినింగ్‌కు అడ్డు పడిందా అన్న వాదన కూడా వినిపిస్తోంది. అయితే రాష్ట్రంలో దాదాపు 15 జిల్లా ఆస్పత్రులకు ఇలాగే డిప్యూటీ కలెక్టర్లను ఏఓలుగా నియమించగా పలువురు ఇప్పటికే జాయిన్ అయినట్లు ఆస్పత్రి, రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇక్కడ నియమితులైన ఏఓ మల్లికార్జునరెడ్డి ఎందుకు జాయిన్‌కాలేదనేదే ప్రశ్నార్థకంగా మారింది. ఆయన ఇంకో పోస్టుకు ప్రయత్నిస్తున్నట్లుకూడా ప్రచారం జరుగుతోంది.

మిక్స్‌డ్ క్రికెట్ లీగ్ విజేత ఏఎస్‌వీ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మిక్స్‌డ్ జెండర్ క్రికెట్ లీగ్ విజేతగా అనంత క్రీడాగ్రామం (ఏఎస్‌వీ) జట్టు నిలిచింది. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్తంగా ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో మిక్స్‌డ్ జెండర్ లీగ్ పోటీలు నిర్వహించారు. ఫైనల్ క్రికెట్ పోటీల్లో అనంత క్రీడాగ్రామం రాప్తాడు, ఆత్మకూరు జట్లు తలపడ్డాయి. ఆత్మకూరు నిర్ణీత 20ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 56 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఏఎస్‌వీ రాప్తాడు 11.2ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది. ఫుట్‌బాల్ పోటీల్లో అండర్-10లో హిందూపురం టౌన్ విజేతగా, మడకశిర రన్నర్‌గా నిలిచింది. అండర్-8లో హిందూపురం టౌన్ విన్నర్‌గా, ధర్మవరం రన్నర్‌గా, చిలమత్తూరు తృతీయ స్థానంలో నిలిచాయి. అండర్-10 హాకీలో విన్నర్‌గా కళ్యాణదుర్గం, రన్నర్‌గా దురుదకుంట, తృతీయ స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. హాకీ అండర్-8లో కళ్యాణదుర్గం, కళ్యాణదుర్గం బీ టీం, అనంతపురం జట్లు వరుసగా మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. అనంతరం అధికారుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, కోఆర్డినేటర్ వంశీకృష్ణ, ఫుట్‌బాల్ మేనేజర్ దాదాఖలందర్, కోచ్‌లు ప్రవీణ్, రఫీఅహ్మద్, చౌడేశ్వరప్రసాద్, అనీల్‌కుమార్, దేవకి తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీతో విజేత అనంత క్రీడాగ్రామం జట్టు

సామూహిక ప్రయోజనాల సాధనే

సాహిత్యం లక్ష్యం

- ఆచార్య ఎంఎం వినోదిని


ఆచార్య రాచపాళెం దంపతులకు చం.స్పందన 2023 జీవన సాఫల్య పురస్కారం అందజేసి, సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సామూహిక ప్రయోజనాలను సాధించడమే సాహిత్యం లక్ష్యమని యోగివేమన విశ్వవిద్యాలయ ఆచార్యురాలు ఎంఎం వినోదిని పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో సీనియర్ సాహితీవేత్త ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డికి 'చం.స్పందన 2023 జీవన సాఫల్య పురస్కారం' అందజేశారు. కార్యక్రమానికి ఆచార్య ఎంఎం వినోదిని ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సాహిత్యం ద్వారా సామూహిక ప్రయోజనాలు ఆశించిన విశిష్ట సాహితీమూర్తి ఆచార్య రాచపాళెం అనీ, ఆయన కవిత్వం మట్టిపరిమళంతో శ్రమ, భాగస్వామ్యంతో నిండిఉందని విశ్లేషించారు. విమలా శాంతి సాహిత్య సామాజిక సేవాసమితి వ్యవస్థాపకుడు డాక్టర్ శాంతినారాయణ మాట్లాడుతూ... సంప్రదాయ భావజాలంలో ఉన్న తెలుగుశాఖ రాచపాళెం దృక్పథం, సారథ్యం వల్ల ఆధునికమయ్యాయన్నారు. హేతుబద్ధత, శాస్త్రదృష్టి వంటి ఆధునిక భావాలు రాచపాళెం జీవితంలో, ఆయన సాహిత్యంలో ప్రతిబింబిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సాహితీకారులు షమీవుల్లా, రాధేయ, ఏలూరు యంగన్న, జెట్టి జయరాం, తరిమెల అమరనాథరెడ్డి, అంకె శ్రీనివాస్, మధురశ్రీ, ఓబులేసు, అశ్వత్థరెడ్డి, షరీఫ్, నానీల నాగేంద్ర, రియాజ్, పూజారి ఈరన్న పాల్గొన్నారు.

పోలీసుల క్రీడాపోటీలు ప్రారంభం


టాస్ వేస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం,డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసుల స్పోర్ట్స్, గేమ్స్ మీట్ ప్రారంభమైంది. పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం అనంతపురం అర్బన్ సబ్ డివిజన్, ఏఆర్ విభాగం పోలీస్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఈ రెండు జట్ల మధ్య 15 ఓవర్ల మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం అర్బన్ సబ్ డివిజన్ జట్టు నిర్ణీత 15 ఓవర్లకు 110పరుగులు చేయగా, ఏఆర్ పోలీస్ జట్టు 12.5ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ రాము, ఎస్ఐ రుష్యేంద్రబాబు, ఆర్ఎస్ఐలు జాఫర్, మగ్బూల్, రమేష్‌నాయక్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

937 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 937 క్యూసెక్కుల వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్ఎస్ఎస్-2కు 897 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

అనంతకు బోరుగడ్డ అనిల్

నాలుగో పట్టణ పోలీసుల కస్టడీలోకి..

అనంతపురం క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్‌ను అనంతపురం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. బోరుగడ్డ అనిల్ ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు నగరానికి చెందిన తెలుగు మహిళ నేత ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకున్నారు. శనివారం ఉదయం ఫోర్త్‌టౌన్ సీఐ సాయినాథ్, ఎస్ఐ రాంప్రసాద్.. సిబ్బందితో కలిసి అనిల్ కోసం వెళ్లారు. తెల్లవారుజామున 1.20 గంటలకు అతడిని నేరుగా పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన కుటుంబసభ్యులను అసభ్యకరంగా విమర్శిస్తూ యూట్యూబ్ చానల్‌లో కించపరిచే విధంగా మాట్లాడారని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజశ్విని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండటంతో పెద్దగా పట్టించుకోలేదు. కేసు కూడా కట్టలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల సంగా తేజశ్విని ఇటీవల నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వారు కేసు నమోదు చేశారు. రాజమండ్రి కోర్టు నుంచి మూడు రోజులపాటు కస్టడీ కోరారు. వైద్య పరీక్షలు అక్కడే నిర్వహించి, శనివారం నాలుగో పట్టణ పోలీసులు రాజమండ్రి కోర్టు నుంచి బోరుగడ్డ అనిల్‌కుమార్‌ను తీసుకొచ్చారు.


బోరుగడ్డ అనిల్‌కుమార్


పోలీసు స్టేషన్ గేటు మూసి పహారా కాస్తున్న సిబ్బంది

లైట్లు ఆర్పేసి... పోలీసుల ఓవరాక్షన్...

బోరుగడ్డ అనిల్ విషయంలో పోలీసులు ఓవరాక్షన్ చేశారు. తెల్లవారుజామున 1.20 గంటల సమయంలో నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. అప్పటికే స్టేషన్ ఆవరణలో లైట్లు ఆర్పేశారు. వచ్చీరాగానే అనిల్‌ను కిందకు దింపి లోపలకు తీసుకెళ్లారు. ఆదివారం సైతం పోలీసు స్టేషన్‌కు తాళం వేశారు. ఇంటర్నేషనల్ కిల్లర్‌ను తీసుకొచ్చినట్లుగా పోలీసులు వ్యవహరించారు.


నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో వాహనాలు

తెలియదు... గుర్తు లేదు..

విచారణలో పోలీసులకు బోరుగడ్డ అనిల్ పెద్దగా సహకరించినట్లు లేదని సమాచారం. తెలియదు... పెద్దగా గుర్తులేదు.. అంటూ సమాధానమిచ్చినట్లు సమాచారం. ఆదివారం అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు సమక్షంలో నాలుగో పట్టణ పోలీసులు బోరుగడ్డ అనిల్‌ను విచారించారు. వీఆర్వోల ఎదుట స్టేటమెంట్‌ను తీసుకున్నట్లు తెలిసింది. బోరుగడ్డ గతంలో మాట్లాడిన వీడియోల ఆధారంగా ప్రశ్నించినట్లు సమాచారం. 'నీవే కదా ఈ వీడియోలో మాట్లాడింది' అని అడిగినట్లు తెలిసింది. అనిల్ తరఫున న్యాయవాది హాజరైనట్లు సమాచారం. కాగా మొత్తం మూడు రోజులపాటు కస్టడీకి తీసుకున్నారు. సాయంత్రం 5గంటలు దాటితే విచారించడానికి వీలుండదు. సోమవారం సాయంత్రం 5గంటలకు రాజమండ్రి సెంట్రల్ జైలుకు తీసుకెళ్లాలి. సోమవారం సాయంత్రం వైద్య పరీక్షలు నిర్వహించి, స్థానిక కోర్టులో హాజరు పరిచి, అనంతరం అతడిని తీసుకెళ్తారు. ప్రయాణ సమయం వీలుగా చూపి మంగళవారం ఉదయం రాజమండ్రి కోర్టులో హాజరు పరిచే అవకాశం ఉంది.

గుంతల రోడ్లు.. వెలగని వీధిలైట్లు

- ఆటోనగర్‌లో తిష్ట వేసిన సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న మెకానిక్‌లు


ఆటోనగర్‌లో ఏర్పడిన భారీ గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

రాప్తాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో ఉన్న ఆటో నగర్‌లో సమస్యలు తిష్ట వేశాయి. ప్రధాన రోడ్లు, లింక్ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. భారీ గుంతలు ఏర్పడటంతో వర్షపు నీరు ఎక్కువగా నిలిచి బురదమయంగా మారుతున్నాయి. ద్విచక్రవాహనాలతో పాటూ ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటో నగర్‌లో చాలా వరకు వీధిలైట్లు కూడా లేకపోవడంతో చీకటి మయంగా ఉంది. 2011లో రాప్తాడులో ఆటో నగర్ ఏర్పాటయింది. ఏపీఐఐసీ సంస్థ రాప్తాడులోని సర్వే నెంబర్ 554-2లో 33 ఎకరాల దేవదాయశాఖ భూమిని లీజుకు తీసుకుంది. ఆ భూమిని సబ్ లీజుకు ఆటోనగర్‌కు కేటాయించారు. ఏపీఐఐసీ నిబంధనల ప్రకారం రాప్తాడులో ఏర్పాటు చేశారు. అందులో దాదాపు 375 మెకానిక్ షాపులు నెలకొల్పారు. గతంలో అనంతపురం నగరంలోనే వాహనాల రిపేరీ షాపులు ఉండటం వలన ట్రాఫిక్ సమస్యలు ఎక్కువ కావడంతో అప్పట్లో అధికారులు, ప్రజాప్రతినిధులు నగరానికి దూరంగా మెకానిక్ షాపులు ఉండాలని రాప్తాడులో ఆటో నగర్ ఏర్పాటు చేశారు. ద్విచక్రవాహనం మినహా అన్ని వాహనాల రిపేరీకి మెకానిక్ షాపులు ఉన్నాయి. జిల్లా నలుమూలల నుంచి వాహనాల రిపేరి కోసం ఆటో నగర్‌కు వస్తుంటారు. అయితే ఆటో నగర్‌లో రోడ్లు సక్రమంగా లేకపోవడంతో వాహనదారులు, మెకానిక్ షాపుల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత టీడీపీ హయాంలోనే బోర్లు, మట్టి రోడ్లు...

గత టీడీపీ ప్రభుత్వంలో 2014నుంచి 2019 వరకూ కొంత వరకు అభివృద్ధి పనులు చేపట్టారు. అప్పట్లో ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు స్థానిక నాయకులు 2015లో ఆటో నగర్‌లోని ప్రధాన రోడ్లు, లింక్ రోడ్లకు మట్టి తోలించి వాహనాల రాకపోకలను సులభతరం చేశారు. ఎంపీ నిధులు రూ. 5 లక్షలుతో ఆటో నగర్‌లో తాగు నీటి బోర్లు వేయించారు. మినీ ట్యాంకులు నిర్మించి పైపులైన్లు వేశారు. వీధిలైట్లు ఏర్పాటు చేశారు. 2019లో వైసీపీ అధికారంలో వచ్చిన తరువాత ఆటో నగర్‌లో అభివృద్ధి మూలనపడింది. కనీసం మట్టి కూడా తోలించకపోవడంతో రోడ్లు అధ్వానంగా మారాయి. వీధిలైట్ల మరమ్మత్తులు చేపట్టకపోవడంతో పాడైపోయాయి. చాలా వరకు వీధిలైట్లు లేకపోవడంతో దొంగతనాలు ఎక్కువ అయ్యాయని మెకానిక్‌లు వాపోతున్నారు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో ఆటో నగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని ఇక్కడి మెకానిక్‌లు ఆశిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోనూ ఆటో నగర్‌లో రోడ్లు, వీధిలైట్లు, పైపు లైను, ఇతర అభివృద్ధి పనులు చేపట్టారు కావున అభివృద్ధి పనులు జరుగుతాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి



ఆటో నగర్‌లో చాలా విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు వెలగడం లేదు. కొన్ని విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు లేవు. అన్ని స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేయాలి. రాత్రి పూట లైట్లు వెలిగితే దొంగతనాలను అరికట్టే అవకాశం ఉంటుంది.

- బాబాఫక్రుద్దిన్ ఆటో నగర్

రోడ్లను బాగు చేయాలి



ఆటో నగర్‌లో రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీరు ఎక్కువగా నిలిచింది. గుంతల దారిలో వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లకు మట్టి తోలించి చదును చేసి సీసీ రోడ్లు నిర్మించాలి.

- హాజీ వలి, ఆటోనగర్

సంక్షిప్తం

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం


మాట్లాడుతున్న జేడీ ఉమామహేశ్వరి

గార్లదిన్నె, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని దళారీలకు అమ్మి మోస పోవద్దని ఆర్డీఓ కేశవనాయుడు, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరి సూచించారు. మండల పరిధిలోని కల్లూరు మార్కెట్ యార్డులో ఆదివారం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులు వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి ప్రభుత్వ మద్ధతు ధరతో విక్రయించుకోవాలన్నారు. తేమ 17శాతం ఉన్న క్వింటా వరి ధాన్యాన్ని రూ.2,300తో కొనుగోలు చేస్తామన్నారు. తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఏఓ సోమశేఖర్, మధు, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆదాయం రూ.3.99 లక్షలు

అనంతపురం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.3,99,500 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ. 2,20,400, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,79,100 వచ్చిందని తెలిపారు.

అక్రమాలు ఆగవా..?

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని పారదర్శక పాలన అందించే కూటమి ప్రభుత్వంలోనూ అక్రమాలు కొనసాగిస్తారా? అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఫోరం, ఆర్‌ఈఎఫ్ ప్రతినిధి ఉజ్వల్ వాపోయారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్‌కు నిర్వహిస్తున్న విద్యాశాఖలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ల నియామక జాబితా ఇందుకు నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వంపై ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అధికారుల్లో వ్యతిరేక తను పెంచేలా జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారుల చర్యలు ఉన్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా జాబితాను రద్దుచేసి పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్‌చేశారు.

వ్యక్తి అదృశ్యం


రాఘువ (ఫైల్)

నార్పల, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రమైన నార్పల కూతలేరు బ్రిడ్జి వద్ద శనివారం రాత్రి ఉన్న రాఘవ అనే డ్రైవర్ అదృశ్యమైనట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. గ్రామానికి చెందిన రాఘవ తనకున్న స్థలంలో ఇంటిని నిర్మించుకున్నాడు. కొందరు అనవసరంగా తనపై బెదిరింపులకు పాల్పడుతున్నారని, తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని ఇంట్లో కుటుంబసభ్యులకు సెల్‌ఫోన్ ఇచ్చి కనిపించకుండా పోయాడు. పలు చోట్ల కుటుంబ సభ్యులు వెతికిన కనిపించలేదని డ్రైవర్ రాఘవ భార్య సువర్ణ పోలీ సులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాగర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఎలాంటి ఆత్మహత్య చేసుకోవద్దని, తిరిగి ఇంటికి రావాలని సోషల్ మీడియాలో పెద్దఎత్తున పోస్టులు పెట్టారు. రాఘవ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే బండారు శ్రావణి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, టీడీపీ నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు పరామర్శించారు. డ్రైవర్ రాఘవ ఎక్కడున్నా క్షేమంగా తీసుకురావాలని వారు పోలీసులను కోరారు.

అట్టహాసంగా నిచ్చెన మెట్ల ప్రారంభం


మెట్లను ప్రారంభిస్తున్న పప్పూరు విజయ్‌కుమార్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా జడ్జి బంగ్లా ఎదురుగా ఉన్న పప్పూరు రామాచార్యులు విగ్రహానికి నిచ్చెన మెట్ల ప్రారంభోత్సవాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. దాదాపు 30 సంవత్సరాల క్రితం నుంచి పప్పూరు రామాచార్యులు విగ్రహానికి నిచ్చెన మెట్లు లేవు. ఈ నేపథ్యంలో పప్పూరు రామాచార్యులు స్మారక కమిటీ కన్వీనర్ నాగలింగయ్య ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, నిచ్చెన మెట్లను ఏర్పాటు చేయించారు. పప్పూరు రామాచార్యులు మనువడు విజయ్‌కుమార్ చేతులమీదుగా ఆదివారం ప్రారంభించారు. పప్పూరు రామాచార్యులు మనువరాలు జమున, జ్వాలాపురం శ్రీకాంత్, నగరపాలక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, సాహితీవేత్త డాక్టర్ శాంతినారాయణ, నానీల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

అనంతపురం అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అర్బన్ ప్రాంతానికి చెందిన టీడీపీ కార్యకర్త ముషీర్ మృతికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సంతాపం వ్యక్తం చేశారు. గత వారం రోజుల క్రితం కాలువపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో ముషీర్ తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముషీర్ మృతిపై సంతాపం తెలియజేయడంతోపాటు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్థికసాయం అందించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి సన్నిధిలో ఎమ్మెల్యే దగ్గుపాటి


ఎమ్మెల్యే దంపతులను సత్కరిస్తున్న ఆలయ అధికారులు

ఆత్మకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు సంతోషంగా ఉండాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడునాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు రాముస్వామి దగ్గుపాటి దంపతులను ఆశీర్వదించారు. అనంతరం ఆలయ అధికారులు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి బాబు, సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

భగవద్గీత పఠన పోటీలకు స్పందన


భగవద్గీతను పఠిస్తున్న విద్యార్థులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గీతాజయంతిని పురస్కరించుకుని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పఠన పోటీలకు విశేష స్పందన లభించింది. ఆరు నుంచి 9వ తరగతి వరకు రెండు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి దాదాపు వందమంది విద్యార్థులు పాల్గొని భగవద్గీత పఠనం చేశారు. ఈ పోటీల్లో 6, 7 తరగతుల విభాగంలో విద్యార్థులు విష్ణుప్రియ, హేమాచలం, శ్యామల వరుసగా ప్రథమ, ద్వితీయ తృతీయస్థానాల్లో గెలుపొందారు. 8, 9వ తరగతుల విభాగంలో జ్ఞానకీర్తి, లహరి, రిషిక ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో గెలుపొందారు. అలాగే సంపూర్ణ భగవద్గీత పఠనంలో సీనియర్స్ విభాగంలో నార్పల నారాయణప్ప, బయన్న, నల్లపరెడ్డి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పోటీలకు శ్రీపాద వేణు, న్యాయవాది నాగేశ్వరి, పండిట్ వేణు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీల అనంతరం విజేతలకు జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో టీటీడీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బాబు, రేనాటి నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై వడ్డీ వ్యాపారుల దాడి

అనంతపురం క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని కమలానగర్‌లో వడ్డీ వ్యాపారులు దాడి చేయడంతో నాగరాజు అనే వ్యక్తి ఆసుపత్రి పాలయ్యాడు. అతడి సోదరి మాధవి విలేకరులకు వివరాలు వెల్లడించారు. గుల్జార్‌పేటలో ఉంటున్న తన సోదరుడు నాగరాజు రోజుకు రూ.5వేలు వడ్డీ ప్రకారం వడ్డీ వ్యాపారులతో రూ.లక్ష అప్పు తీసుకున్నాడ న్నారు. కొన్ని రోజులుగా డబ్బు చెల్లించకపోయాడన్నారు. ఈక్రమంలో ఆదివారం తన సోదరుడు నాగరాజు కమలానగర్‌లో ఉంటున్న తమ ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో 15మంది వచ్చి దాడి చేశారని వాపోయారు. పార్వతి, జిత్తు, రాజు, లక్ష్మి, వరాలు తదితరులు దాడి చేశారని, తన సోదరుడు, తన కుమారుడికి వారి నుంచి ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం ఎవరికైనా ఫిర్యాదు చేస్తామని చెబితే... తాము పోలీసులను, మీడియాను మేనేజ్ చేస్తామని చెప్పారని, న్యాయం చేయాలని కోరారు. కాగా ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

అనంతపురం క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేసే వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో గంజాయి రవాణా, విక్రయాలు చేసే ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. జిల్లా ఎస్పీ జగదీష్ పరిధిలోని ప్రత్యేక పోలీసుల బృందం వారిని అరెస్ట్ చేసినట్లు తెలిసింది. వారి వెనుక ఇంకా ఎవరెవరున్నారు..? గంజాయి రవాణాలో ఉన్న వారి పాత్రపై విచారిస్తున్నట్లు తెలిసింది.

టీడీపీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


అభినందన లేఖలు అంజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. టీడీపీ యాప్ ద్వారా పార్టీ చేపట్టిన కార్యక్రమాలను పలువురికి షేర్ చేసిన శింగనమలకు చెందిన మెండిపోగుల ఎర్రిస్వామి, లోలూరు నారాయణస్వామికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ నుంచి అభినందన లేఖలు వచ్చాయి. వాటని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సీనియర్ నాయకురాలు బండారు లీలావతి ఆదివారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. టీడీపీ కార్యక్రమాలను యాప్ ద్వారా ప్రజలకు షేర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాసూలచంద్రమోహన్ పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తాచాటిన పీఆర్ఆర్ కళాశాల విద్యార్థులు


పతకాలు సాధించిన విద్యార్థులతో పల్లె కిశోర్ తదితరులు

అనంతపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ క్రీడల్లో పీఆర్ఆర్ ఎంబీఏ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఈ సందర్భంగా ఆదివారం రుద్రంపేట లోని పీవీకేకే కళాశాల లో విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, క్యాంపస్ ఇన్‌చార్జ్ సంతోష్‌రెడ్డి తదితరులు వారిని అభినందించారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో గుత్తి మున్సిపాల్టీలో ఉన్న పీఆర్ఆర్ ఎంబిఏ కళాశాలలో సెకెండియర్ చదువుతున్న జైసాయి సుభాష్ రెండు బంగారు పతకాలు, రెండు రజత పతకాలు, ఒక కాంస్య పతకంతో పాటు అథ్లెటిక్ చాంపియన్‌షిప్ సాధించాడు. అదేవిధంగామొదటి సంవత్సరం విద్యార్థిని త్రివేణి జవిలిన్‌లో బ్రోంజ్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పల్లె కిశోర్ మాట్లాడుతూ..విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమన్నారు. క్రీడారంగం వైపు ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఎల్లప్పుడూ వెనువెంట ఉంటామన్నారు.

రూరల్ లీగ్ పోటీల్లో సెంచరీల మోత



తన్మయి కార్తీక్‌రెడ్డి, అభినవ్ సాత్విక్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రూరల్ క్రికెట్ లీగ్ పోటీల్లో పలువురు క్రీడాకారులు సెంచరీల మోత మోగించారు. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్తంగా ఆదివారం స్థానిక తపోవనం క్రికెట్ అకాడమీ గ్రౌండ్‌లో రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించాయి. తపోవనం క్రికెట్ అకాడమీ, కదిరి జట్లు తలపడగా...టీసీఏ జట్టు 40 ఓవర్లలో 4 వికెట్లకు 308 పరుగులు చేసింది. బ్యాటర్లు తన్మయి కార్తీక్‌రెడ్డి 122 పరు గులు, అభినవ్ సాత్విక్‌రెడ్డి 101 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన కదిరి 40 ఓవర్లలో 166 పరుగులు చేసింది. బ్యాటర్ రోహిత్ 102 పరుగులు చేసి చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోర్ అందజేశాడు. అయినా తపోవనం క్రికెట్ అకాడమీ జట్టు 162 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం ఇంచార్జి కార్యదర్శి బీమలింగా రెడ్డి, సభ్యులు, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


రోహిత్

ప్రజాసమస్యలపై నిత్య పోరాటం

- సీపీఎం మహా సభలో... రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్


మహాసభలో ప్రసంగిస్తున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు చేసేది, దేశంలో ప్రజలకు కష్టం వస్తే అండగా నిలిచేది కమ్యూనిస్టులేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఎం నగర ఎనిమిదో మహాసభలో రాంభూపాల్ ప్రసంగించారు. పాలకులు తీసుకునే ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ప్రజలు వెంటనే చూసేది కమ్యూనిస్టుల వైపే అన్నారు. ఇతర పార్టీలతో పోలిస్తే గ్రామ స్థాయి నుంచి జాతీయస్థాయి వరకూ ప్రజాసమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని, అందుకే ప్రజలు ఏ కష్టం వచ్చినా కమ్యూనిస్టు నాయకులవైపు చూస్తారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జీలు పెంచితే వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించి ఉద్యమాలు చేశాయని గుర్తుచేశారు. పాలకులు తీసుకునే నిర్ణయాలపై ప్రజల్లో ఆగ్రహం వస్తే ఎవరూ ఆపలేరనడానికి గత ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయమే నిదర్శనమన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై జాతీయస్థాయిలో సీపీఎం నిరసనలు తెలిపిందన్నారు. వైసీపీ హయాంలో అంగన్‌వాడీలు వారి సమస్యలపై 42 రోజుల సమ్మె చేశారని, ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సబబు కాదన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్లను అడ్డం పెట్టుకుని, హిందుత్వాన్ని ముందుకు తెచ్చి, మతతత్వాన్ని రెచ్చగొడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేంద్రకుమార్, బాలరంగయ్య, సావిత్రమ్మ, నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్‌వీ నాయుడు, గోపాల్, వెంకటనారాయణ, ప్రకాష్, వలి, మసూద్, వెంకటేష్, ఎస్టీఆర్ శీన, ప్రసాద్, ఓబులేసు, ఇర్ఫాన్, బుల్లే రాజు, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ


పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

అనంతపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములాయి గ్రామంలో ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజను భక్తి శ్రద్ధలతో సాగింది. అయ్యప్పస్వామితో పాటు వినాయకుడు, సుబ్రహ్మణేశ్వర స్వాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు భజనలు చేస్తూ స్వామి కీర్తలు ఆలపించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. సాయంత్రం అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు కొబ్బరి కాయలు కొట్టి, తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు.

వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా జరపాలి

- వడ్డెర్ల సంఘం నాయకుల విన్నపం


మాట్లాడుతున్న వడ్డెర్ల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి, ఉమ్మడి అనంత జిల్లా అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్ కోరారు. స్థానిక శ్రీనివాస్ నగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో వారు ఆదివారం మీడియాతో మాట్లాడారు. జనవరి 11వ తేదీన వడ్డె ఓబన్న జయంతి ఉందన్నారు. అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ముందస్తు నిర్ణయాన్ని ప్రకటించాలన్నారు. త్వరలో సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఉమ్మడి అనంత జిల్లాలోని అన్ని మండలాల్లో నూతన కమిటీల ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. వడ్డెర్లను చైతన్యవంతులను చేసి, ప్రభుత్వం నుంచి రావాల్సిన హక్కులను రాబట్టేందుకు ముందుకు వెళతామ న్నారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చేలా ప్రత్యేక చొరవ చూపాలని, వడ్డెర్లకు కొండలు, క్వారీల కాంట్రాక్టు పనుల్లో రాయితీ కల్పించాలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. వడ్డెర్లకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీనివాసులు, పీట్ల రవీంద్ర, పల్లవ రాజు, ఎల్లప్ప, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో అదరగొట్టిన ఆర్ట్స్ కళాశాల

- ఓవరాల్ చాంపియన్‌గా అవతరణ


విజేతలను అభినందిస్తున్న స్పోర్ట్స్ డైరెక్టర్ జెస్సీ, కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ

అనంతపురం సెంట్రల్/క్లాక్‌టవర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచారు. మహిళా విభాగంలో 62, పురుషుల విభాగంలో 64 ప్రకారం మొత్తం 127 పాయింట్లతో ఓరాల్ చాంపియన్లుగా నిలిచారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్ చాంపియన్ షిప్-2024 పోటీలు ఆదివారం ముగిశాయి. ఓవరాల్ చాంపియన్‌గా ఆర్ట్స్ కళాశాల, ద్వితీయ స్థానంలో ఎస్ఎస్‌బీఎన్, తృతీయ స్థానంలో హిందూపురం ఎస్‌డీజీఎస్ కళాశాల, నాలుగో స్థానంలో గుత్తి పీఆర్ఆర్ఎంఎస్ కళాశాల నిలిచాయి. విజేతలకు ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీరామ్, అథ్లెటిక్ కోచ్‌లు, పీడీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల సహకారం


ముఖద్వారం గేటును ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాల ముఖద్వారం గేటును 1992-93 పదోతరగతి పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేయించారు. ఆదివారం ప్రారంభించారు. ఆరునెల్ల క్రితం సమావేశమై తాము చదివిన పాఠశాలకు శాశ్వత పని చేయాలని నిర్ణయించారు. రూ. 5లక్షలతో పాఠశాలకు ఐరన్ గేటు, ఆర్చ్ ఏర్పాటు చేశారు. ఇది తమకు ఎంతో సంతోషంగా ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీధర్,భాస్కరరెడ్డి, మహేష్, రఘు, బాలపోతన్న, మల్లికార్జున, మధు, వెంకటేష్, శ్రీనివాసరెడ్డి తదితరుల పాల్గొన్నారు.

కనకదాస జయంతి వేడుకలు


భోగినేపల్లిలో జ్యోతులను ఊరేగిస్తున్న కురుబ కులస్థులు

రాప్తాడు, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగినేపల్లిలో ఆదివారం కనకదాస జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కనకదాస విగ్రహాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. కురుబ కులస్థులు జ్యోతులు ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లి భక్త కనకదాసకు సమర్పించారు. ఈ సందర్భంగా గొరవయ్యల నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. అన్నదానం చేశారు. రాత్రి కనకదాస చిత్రపటాన్ని ఊరేగించారు. సర్పంచ్ ఉజ్జినప్ప, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

గాలికుంటువ్యాధితో 15 మేకలు మృతి


మేకల కళేబరాలు

కళ్యాణదుర్గం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కంబదూరు మండలం ఓబిగానిపల్లిలో కురుబ అంజయ్యకు చెందిన 15 మేకలు గాలికుంటు వ్యాధితో ఆదివారం మృతి చెందాయి. దీంతో సుమారు రూ. 90 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. అప్పులు చేసి జీవనా ధారం కోసం 78 మేకలను ఇటీవల కొనుగోలు చేశానని, కంటికి రెప్పలా కాపాడుకుంటున్నానని, అయితే మందలో 15 మేకలు గాలికుంటువ్యాధి భారిన పడి ఉన్నట్టుండి మృతి చెందాయని విలపించాడు. ఆర్థికంగా నష్టపోయానని, ఆదుకోవాలని అయన అధికారులను కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుత్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జెండా వీధి కాలనీకి చెందిన గోపాల్ (53) అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గోపాల్ గత గురువారం కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

యువకుడు..


ముషీర్ (ఫైల్)

బెళుగుప్ప: మండలంలోని కాలువపల్లి వద్ద గల పెన్నా బ్రిడ్జి డివైడర్‌ను గతనెల 23వ తేదీ బైకుపై వెళుతున్న అనంతపురానికి చెందిన యువకులు సురేష్, ముషీర్ ఢీకొని తీవ్ర గాయాల పాలైన విషయం తెలిసిందే. అయితే సురేష్ కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 1వ తేదీన మృతి చెందాడు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో యువకుడు ముషీర్ (22) పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

ఎమ్మెల్యే చొరవతో సదరం సర్టిఫికెట్ మంజూరు


దివ్యాంగుడికి సదరం సర్టిఫికెట్ అందిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరంపల్లి గ్రామానికి చెందిన అక్కులప్ప గారి కురుబ రామాంజనేయులు 2022లో రోడ్డు ప్రమాదానికి గురై కుడి కాలు పూర్తిగా దెబ్బతినింది. ఆయన నడవలేని స్థితిలో ఉన్నాడు. ఈ క్రమంలో సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. పలుమార్లు ఆస్పత్రి, సచివాలయాల చుట్టూ తిరిగిన ఫలితం లేకపోయింది. ఇటీవల పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబును కలిసి సమస్య విన్నవించాడు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సదరం సర్టిఫికెట్ జారీ అయ్యేలా చూశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఉప సర్పంచ్ కురుబ మల్లికార్జున, టీడీపీ నాయకులు మారెప్ప, రంగారెడ్డి, రామాంజినేయులు చాకలి వెంకటేశులు, ఉమేష్, రమేష్ తదితరులు ఆదివారం బాధితుడి ఇంటివద్దకు వెళ్లి సర్టిఫికెట్ అందజేశారు. ఇందుకు ఆయన ఎమ్మెల్యే అమిలినేనికి కృతజ్ఞతలు తెలిపారు.

అప్రకటిత విద్యుత్ కోత

● అసౌకర్యానికి గురైన ప్రజలు

గుత్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ శాఖ అధికారులు అప్రకటిత విద్యుత్ కోత విధించారు. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సుమారు గంటన్నర పాటు సమాచారం లేకుండా విద్యుత్ సరఫరాను అధికారులు నిలపివేశారు. దీంతో ఏమి జరుగుతోందో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 33కేవీ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలపివేసినట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రజాసమస్యలపై నిత్య పోరాటం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై నిత్యం పోరాటాలు చేసేది, దేశం లో ప్రజలకు కష్టం వస్తే అండగా నిలిచేది కమ్యూని స్టులేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఎం నగర ఎనిమిదో మహాసభలో రాంభూపాల్ ప్రసంగించారు. పాలకులు తీసుకునే ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ప్రజలు వెంటనే చూసేది కమ్యూనిస్టుల వైపే అన్నారు. ఇతర పార్టీలతో పోలిస్తే గ్రామ స్థాయి నుంచి జాతీయస్థాయి వరకూ ప్రజాసమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని, అందుకే ప్రజలు ఏ కష్టం వచ్చినా కమ్యూనిస్టు నాయకులవైపు చూస్తారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జీలు పెంచితే వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించి ఉద్యమాలు చేశాయని గుర్తుచేశారు. పాలకులు తీసు కునే నిర్ణయాలపై ప్రజల్లో ఆగ్రహం వస్తే ఎవరూ ఆపలేరనడానికి గత ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజ యమే నిదర్శనమన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై జాతీయస్థాయిలో సీపీ ఎం నిరసనలు తెలిపిందన్నారు. వైసీపీ హయాంలో అంగన్‌వాడీలు వారి సమస్యలపై 42 రోజుల సమ్మె చే శారని, ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పో వడం సబబు కాదన్నారు. కేంద్రంలోని మోదీ ప్ర భు త్వం కార్పొరేట్లను అడ్డం పెట్టుకుని, హిందుత్వాన్ని ముందుకు తెచ్చి, మతతత్వాన్ని రెచ్చగొడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేంద్రకుమార్, బాలరంగయ్య, సావి త్రమ్మ, నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్‌పీ నాయు డు, గోపాల్, వెంకటనారాయణ, ప్రకాష్, వలి, మసూద్, వెంకటేష్, ఎన్టీఆర్ శీన, ప్రసాద్, ఓబులేసు, ఇర్ఫాన్, బుల్లే రాజు, లక్ష్మీ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

గుంతకల్లుటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని ఆదివారం సాయంత్రం మాలధారులు ఘనంగా నిర్వహించారు. పాతగుంతకల్లులోని శివాలయం అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తిని ప్రత్యేక అలంకరణ చేసి ట్రాక్టర్‌లో కొలువుదీర్చారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. బీరప్పసర్కిల్, బస్టాండ్ సర్కిల్, మెయిన్‌రోడ్డు, గాంధీచౌక్, స్టేషన్‌రోడ్డు మీదుగా డీఆర్‌ఎం కార్యాలయం సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయ వరకు ఈ ఊరేగింపు కొనసాగింది. గురుస్వాములు, అయ్యప్ప స్వామి మాలధారులు పాల్గొన్నారు.


అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు

ఇలా అయితే ఎలా?

● ఏళ్లుగా ఆస్తి పన్ను చెల్లించని ప్రభుత్వంలోని వివిధ శాఖలు
● రూ.1.36 కోట్ల మేర పేరుకుపోయిన బకాయిలు
● నోటీసులు ఇస్తూ మిన్నకుండిపోతున్న మున్సిపల్ అధికారులు


గుత్తి మున్సిపల్ కార్యాలయం

గుత్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సకాలంలో పన్నులు చెల్లించి ప్రజలకు మార్గదర్శకంగా ఉండాల్సిన వివిధ ప్రభుత్వ శాఖలు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. గుత్తి మున్సిపాలిటీ పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన భవనాల ఆస్తి పన్ను బకాయిలు కోట్లలో పేరుకుపోతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. మున్సిపల్ అధికారులు కేవలం నోటీసులిచ్చేందుకే పరిమితమవుతున్నారే కానీ గట్టిగా అడగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వసూళ్ల విషయంలో పేదలపై ఒత్తిడి చేస్తున్నారే తప్ప.. ప్రభుత్వ భవనాల వసూళ్లపట్ల పెద్దగా శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గుత్తి మున్సిపల్ పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలు శాఖల భవనాలకు సంబంధించిన ఆస్తి పన్నును ఏళ్ల తరబడి చెల్లించడం లేదు. నిధులు కొరత కారణంగానే చెల్లించడం లేదని ఆయా శాఖల అధికారులు చెప్పి తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా పన్నులు చెల్లించని కారణంగా మున్సిపాలిటీలో జరగాల్సిన అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది.

సామాన్యులపైనే అధికారుల ప్రతాపం

మున్సిపాలిటీ అధికారులు పేద, మధ్య తరగతి ప్రజలతో ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్నారు. ఎవరైనా పన్నులు చెల్లించకపోతే వారికి నోటీసులివ్వడం, అవసరమైతే ఇంటి వద్దకు వెళ్లి ఒత్తిడి చేయడం, కొళాయి కనెక్షన్ తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడడం చేస్తున్నారు. సిబ్బందితో పాటు మున్సిపల్ కమిషనర్ సైతం ఇంటింటా తిరిగి ఒత్తిడి చేసి మరీ పన్నులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ భవనాలకు సంబంధించిన పన్నుల విషయంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఏటా మొక్కుబడిగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఆయా శాఖల పన్నుల బకాయిలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే మార్కెట్‌యార్డు రూ.2.78లక్షలు, పోలీస్ శాఖ రూ.21.42లక్షలు, తాలూకా కార్యాలయం 3.21 లక్షలు, సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్ రూ.3.96లక్షలు, ఎంపీడీఓ కార్యాలయం రూ.1.03లక్షలు, సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్ రూ.3.10లక్షలు, విద్యుత్ కార్యాలయం రూ.4.67లక్షలు, పీడబ్ల్యూడీ కార్యాలయం రూ.3.69లక్షలు, ఆర్‌అండ్‌బీ శాఖ రూ. 6.51లక్షలు, పోస్టల్ శాఖ రూ.1.30లక్షల చొప్పున గుత్తి మున్సిపాలిటీకి బకాయిలు చెల్లించాల్సి ఉంది. మొత్తం కోటి ముప్పై ఆరు లక్షల రూపాయల పన్నులు వసూలు కావాల్సి ఉంది. వీటి వసూళ్లకు సంబంధించి పలుమార్లు నోటీసులు ఇచ్చినా, సంబంధింత శాఖల అధికారులతో మాట్లాడినా ఎలాంటి ఫలితం లేకపోతోందని కమిషనర్ జబ్బర్‌మీయా తెలుపుతున్నారు. ఇకపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేస్తామని ఆయన పేర్కొంటున్నారు.

రబీ పంటలకు తెగుళ్లు

● నివారణకు సలహాలిచ్చేవారు లేక ఆందోళనలో అన్నదాతలు
● విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉన్నా.. సచివాలయాలకే పరిమితం


బసంపల్లిలో తెగుళ్ల భారిన పడిన వేరుశనగ పంట



శెట్టూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా రబీ సీజనల్లో వ్యవసాయ బోరుబావులు కింద రైతులు మొక్కజొన్న, వేరుశనగ, టమాటా, బీర తదితర పంటలు సాగు చేశారు. అయితే ఇటీవల తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలు, పొగ మంచు కారణంగా ఆయా పంటలకు విపరీతమైన తెగుళ్లు సోకాయి. దీంతో పంటలు ఆశాజనకంగా లేవు. ఇది చూసిన అన్నదాతలు కుమిలిపోతున్నారు. ఏ పంటలో ఏ తెగులుకు ఏ మందు పిచికారీ చేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఎరువుల దుకాణాల యజమానులు చెప్పిన మందులే పిచికారీ చేస్తున్నారు. ఇక్కడ పంటల సాగుపై సలహాలు, సూచనలు ఇచ్చే వారే కరువయ్యారని అన్నదాతలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ప్రతి సచివాలయానికి ఒక విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉన్నా.. వారు ఏనాడూ పంటలను పరిశీలించిన పాపాన పోలేదంటున్నారు. కేవలం సచివాలయాలకే పరిమితమయ్యారని వాపోతున్నారు. ఏ ఒక్కరూ గ్రామాలకు వెళ్లి పంటలు పరిశీలన చేసి సలహాలు ఇచ్చిన పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలానికి రెగ్యులర్ వ్యవసాయాధికారి లేక ఏళ్ల గడుస్తోంది. జిల్లా అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో కింది స్థాయి సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో వారు సక్రమంగా విధులు నిర్వహించడం లేదు. దీంతో తెగుళ్ల నివారణకు సరైన సలహాలు, సూచనలు చెప్పేవారులేక రూ.లక్షలు ఖర్చు చేసి సాగు చేసిన పంటల్ని నష్టపోతున్నామని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రెగ్యులర్ వ్యవసాయాధికారి నియమించి, కింది స్థాయి సిబ్బందిని అందుబాటులో ఉంచాలని వారు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిడుతూరుకు వెళ్లే రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. రాంపురం గ్రామానికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి పత్తిని ఐషర్ వాహనంలో కర్ణాటకలోని బళ్లారికి తీసుకెళ్తున్నాడు. అయితే మిడుతూరుకు వెళ్లే దారిలో స్టీరింగ్ రాడ్ కట్ కావడంతో వాహనం అదుపుతప్పి రహదారి పక్కన పడిపోయింది. ఈ సంఘటనలో విజయభాస్కర్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

రెవెన్యూ సదస్సుల తేదీల్లో మార్పులు

పుట్లూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగే తేదీల్లో మార్పులు చేసినట్లు తహసీల్దార్ శేషారెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా 10వ తేదీన గాండ్లపాడు, జి. వెంగన్నపల్లి, 11న శనగలగూడూరు, తక్కలపల్లి, నారాయణపల్లి, పోలిరెడ్డిపల్లి, ఎస్. వెంగన్నపల్లి, తిమ్మాపురం, కొండేపల్లి, గోపరాజుపల్లి, 17న పుట్లూరు, నాయకునిపల్లి, నాగిరెడ్డిపల్లి, బాలాపురం, చింతలపల్లి, 18న చాలవేముల, 19న కుమ్మనమల, రంగరాజుకుంట, రంగమనాయనపల్లి, కొత్తపల్లి, తురకపల్లి, 20న మడ్డిపల్లి, చెర్లోపల్లి, నారాయణరెడ్డిపల్లి, 21న ఎల్లుట్ల, 27న కడవకల్లు, సంజీవపురం, 28న సూరేపల్లి, గొల్లపల్లి, జనవరి 2న ఓబులాపురం, దోసలేడు, 3న చింతకుంట, 4న కందికాపుల, 7న మడుగుపల్లి, జంగంరెడ్డిపేట, 8న చిన్నమల్లేపల్లి, 9న కోమటికుంట్ల, 10న గరుగు చింతలపల్లిలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. రైతులు భూముల సమస్యలపై అర్జీలు ఇవ్వాలని సూచించారు.

డ్రైనేజీలు లేకుండా.. సీసీ రోడ్ల నిర్మాణమా?

బొమ్మనహాళ్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డ్రైనేజీలు లేకుండా కేవలం సీసీ రోడ్లను ఎందుకు నిర్మిస్తున్నారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని ఉంతకల్లులో మార్కండేయ స్వామి ఆలయం నుంచి మెయిన్ రోడ్డు లోని ట్యాంక్ వరకు సీసీ రోడ్డును ఇటీవల పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మించారు. అయితే వర్షపు నీరు, ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు ముందుకెళ్లకుండా రోడ్డును అడ్డగోలుగా వేశారని, దీంతో నీరంతా ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. కొద్ది దూరంలో పెద్దడ్రైనేజీ ఉందని, అందులోకి నీరు వెళ్లే మార్గం కూడా చేయలేదని అంటున్నారు. రోడ్డుపై నీరు నిల్వ ఉంటుండడంతో ఇళ్లల్లోకి వెళ్లాలంటే అసౌకర్యంగా ఉందంటున్నారు. సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టే ముందు నీళ్లు వెళ్లే మార్గాలను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. గ్రామంలో సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేకుండా పోయిందంటున్నారు. ఇప్పటికైనా స్పందించి నీరు నిల్వ ఉండకుండా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.


ఉంతకల్లులో సీసీ రోడ్డు వేయడంతో నిల్వ ఉన్న మురుగు నీరు

అనుమానితులను వెంటాడిన రైతులు

● దైవాలమడుగులో రాత్రి 12గంటల సమయంలో ఉత్కంఠ

యాడికి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కేబుల్‌వైర్ల చోరీ అనుమానితుల సంచారంతో శనివారం రాత్రి 12గంటల సమయంలో దైవాలమడుగులో ఉత్కంఠ నెలకొంది. రైతులు అనుమానితులను వెంటాడి పట్టుకొని పెద్దవడుగూరు పోలీసులకు అప్పగించారు. దైవాలమడుగు గ్రామానికి చెందిన రైతులు తెలిపిన మేరకు గ్రామంలోని వ్యవసాయ తోటల్లో గత కొంతకాలంగా కేబుల్‌వైర్లు చోరీ అవుతున్నాయి. ప్రతిరోజూ రాత్రివేళల్లో దొంగలు కేబుల్‌వైర్లు ఎత్తుకెళుతుండటంతో రైతులు గ్రూపులుగా ఏర్పడి రాత్రివేళల్లో తోటల వద్ద కాపలా కాస్తున్నారు. శనివారం రాత్రి ఇద్దరు అనుమానితులు వ్యవసాయ తోటల్లో సంచరించడాన్ని రైతులు గమనించారు. తోటల్లో కాపలా ఉన్న తోటి రైతులకు సమాచారం అందించి అనుమానితులను వెంబడించి పట్టుకున్నారు. సుమారు 2 కిలోమీటర్లు రైతులంతా పరుగులు పెడుతూ అనుమానితులను కిష్టిపాడు సమీపాన పట్టుకున్నారు. ఆ సమయంలో కిష్టిపాడు వద్ద గస్తీ తిరుగుతున్న పెద్దవడుగూరు పోలీసులకు అనుమానితులను అప్పగించారు.


కిష్టిపాడు వద్ద గుమికూడిన దైవాలమడుగు రైతులు

రహదారి ఆక్రమణ

● రోడ్డు స్థలంలో బంకులు ఏర్పాటు చేసి బాడుగలకు ఇచ్చిన కబ్జాదారులు
● వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే దందా
● స్థలం ఆక్రమణతో కుంచించుకుపోయిన రోడ్డు

ఉరవకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో పట్టణంలోని పలువురు కబ్జాదారులు స్థానిక డిగ్రీ కళాశాల ఎదుట ఉన్న అనంతపురం- బళ్లారి రహదారి పక్కన ఖాళీ స్థలాన్ని ఆక్రమించారు. అంతేకాకుండా వాటిల్లో దుకాణాలను ఏర్పాటు చేసి ఇతరులతో వేల రూపాయలు అడ్వాన్స్‌లు తీసుకుని నెలవారీ బాడుగలకు ఇచ్చారు. ఇప్పటికీ అదే దందా నడుస్తోంది. డిగ్రీ కళాశాల ఎదుట రహదారి పక్కన దుకాణాలు పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్నాయి. ప్రధాన రహదారిని ఆక్రమించి, అడ్డూ అదుపు లేకుండా చిల్లర బంకులు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. వీటి వల్ల విశాలంగా ఉన్న రహదారి కుదించుకుపోతోంది. ఫలితంగా ప్రజలు ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు వీటిపై ఎలాంటి దృష్టి సారించడం లేదు. పంచాయతీ క్వార్టర్స్ ముందు భాగంలో కాలువపైనా పలువురు ఇష్టారాజ్యంగా బంకులు ఏర్పాటు చేసుకున్నారు. వారి వద్ద నుంచి వైసీపీ నాయకులు డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిపైన చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.


రోడ్డు పక్కన స్థలంలో బంకులను ఏర్పాటు చేసిన దృశ్యం

ఆంజనేయస్వామి ఫ్లెక్సీల తొలగింపు

● మున్సిపల్ కమిషనర్‌పై మాలధారుల ఆగ్రహం
● కార్యాలయం ఎదుట ధర్నా


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మాలధారులు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 12వ తేదీన జరగనున్న హనుమాద్ వ్రతాన్ని పురస్కరించుకుని గుంతకల్లు పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. దీంతో ఆగ్రహానికి గురైన ఆంజనేయస్వామి, అయ్యప్ప, శివుడు, భవాని మాలాధారులు ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్‌ను కలిసి హనుమాద్ వ్రతానికి చెంది న ఫ్లెక్సీలను కొడవలితో చింపి చెత్త ట్రాక్టర్లలో ఎలా వేస్తారని నిలదీశారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్, టూటౌన్ సీఐలు మనోహర్, ఏపీ మస్తాన్ మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని మాలధారులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. కమిషనర్ బయటకు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాలధారులు మంజులా వెంకటేష్, బీ మహేష్, మహేష్ గుప్తా, కురుబ పురుషోత్తం మాట్లాడుతూ.. హనుమాద్ వ్రతానికి తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా కర్నాటక రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున భక్తులు కసాపురానికి వస్తారన్నారు. అంజనేయస్వామి ఫ్లెక్సీలను తొలగించి హిందూమనోభావాలను దెబ్బతీశారన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలను ముందుగా తొలగించి, మిగితావాటిని తొలగించాల్సిందని ప్రశ్నించారు. చివరికి కమిషనర్ తామే స్వయంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

అగ్రిగోల్డ్ భూములపై ఉన్నతాధికారుల ఆరా

ఆంధ్రజ్యోతి స్పందన

పుట్లూరు, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు- చెర్లోపల్లి గ్రామాల మధ్య ఉన్న అగ్రిగోల్డ్ భూములపై ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రిలో పేరుకే సీజ్ అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించినట్లు సమాచారం. సీజ్‌చేసిన అగ్రిగోల్డ్ భూముల్లో వైసీపీ నాయకుడు ఎలా సాగు చేస్తారని, అలాగే ఆ సంస్థకు చెందిన గోడౌన్‌ను ఇతరులకు ఎలా లీజుకు ఇస్తారని మండల అధికారులను ఆరా తీసినట్లు తెలిసింది. వీటిపై పూర్తి సమాచారం ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది.

ఓమ్నీ వాహనం దగ్ధం

● ఆరుగురికి తప్పిన ప్రమాదం


దగ్ధమైన ఓమ్నీ వాహనం

కణేకల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగేపల్లి వద్ద జరిగిన ఓ ప్రమాదంలో ఓమ్నీ వ్యాన్ దగ్ధమైంది. అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు కర్ణాటక వాసులు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కర్ణాటకలోని దావణగెరె ప్రాంతానికి చెందిన షౌకత్‌అలీ కుటుంబం ఆదివారం ఓమ్నీ వ్యాన్‌లో బొమ్మనహాళ్ మండలం దర్గాహోన్నూరుకు బయలుదేరారు. కాగా మార్గమధ్యంలో నాగేపల్లి వద్ద గ్యాస్ ఆధారితమైన ఆ వాహనంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. కొద్ది సమయంలోనే ఆ మంటలు వాహనానికి పూర్తిగా వ్యాపించాయి. దీంతో అందులో ప్రయాణిస్తున్న షకీలాభాను, అఫీజాబీ, జుబేదాతో పాటు మరో ఇద్దరు పిల్లలు అప్రమత్తమై వెంటనే కిందకు దిగేశారు. వాహనం మొత్తం దగ్ధమైపోయింది. ప్రయాణికులు ప్రమాదం నుండి బయట పడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి: కాలవ


రాయదుర్గంటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును వే గవంతంగా పూర్తి చేసి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం అయన రాయదుర్గం మండ లం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సభ్యత్వ నమోదుపై సమీక్షించా రు. ఈ సందర్భంగా మాట్లాడారు. మండలంలోని 19 పంచాయతీలలో నూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఒక్కో పంచాయతీలో కనీసం 600 మంది సభ్య త్వ నమోదు చేసుకునేవిధంగా చూడాలన్నారు. నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. మండల కన్వీనర్ హనుమంతు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేయిస్తున్న టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లు గ్రామంలో ఆదివారం టీడీపీ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సభ్యత్వం నమోదు చేపట్టారు. రూ. 100 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ. 5 లక్షల వరకు ప్రమాద బీమా పొందవచ్చని వివరించారు. తెలుగుదేశం పార్టీలోనే ఈ అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లన్న, దిలీప్, లేపాక్షి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు లేపాక్షి తూర్పుద్వారం ప్రారంభం


తూర్పుద్వారం గుండా వీల్‌చైర్‌ను తీసుకెళ్తున్న దృశ్యం

లేపాక్షి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయం తూర్పుద్వారాన్ని ఎట్టకేలకు ఆదివారం సంబంధిత అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రారంభించారు. ఇప్పటిదాకా వృద్ధులు, దివ్యాంగులు, చిన్న పిల్లలు ఉత్తర ద్వారంలో ఉన్న మెట్లను ఎక్కలేక చాలా అవస్థలు పడుతున్నారు. దీనిపై కేంద్రప్రభుత్వం లక్షలు వెచ్చించి తూర్పు ద్వారం వద్ద వీల్‌చైర్లకు అనుకూలంగా ర్యాంప్ ఏర్పాటు చేసింది. ఏళ్లు గడిచినా ద్వారాన్ని ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఈ విషయమై నవంబరు 18న ఆంధ్రజ్యోతిలో లక్షలు వెచ్చించినా ప్రారంభంకాని తూర్పుద్వారం అన్న కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు తూర్పుద్వారం వద్ద ర్యాంప్‌కు మరమ్మతులు చేపట్టి ఆదివారం మనుగడలోకి తీసుకొచ్చారు. ఈ ర్యాంప్‌ద్వారా వృద్ధులు, వికలాంగులు, పిల్లలు ఆలయంలోకి ప్రవేశించారు. వీల్‌చైర్లలో ఈ ద్వారం గుండా వెళ్లేందుకు అనుకూలంగా ఉండటంతో వారు హర్షం వ్యక్తం చేశారు.